# ముష్టిది

రచన:
శ్రీ వి. యస్. ఆర్. మౌళి

లేమితనం ఎంత పన్నయినా చేయిస్తుంది. బీదరికంలో ఉన్న బాధలు ఇన్నీ అన్నీ కావు. అయితే బీదతనంలో బాధపడుతూ, కడుపు మాడ్చుకొని పరువు ప్రతిష్ఠలకోసం ప్రాకులాడేవారు యీ రోజుల్లో అరుదుగా కనిపిస్తారు.

'బాబూ, పిడికెడు మెతుకులు పెట్టించండి, నాయనా! రెండ్రోజులై పసిపిల్లాడికి తిండిలేదు.' దీనమయిన గొంతు వినిపించింది. ఆ గొంతులో జీవంలేదు. మూర్తి బయటకు వచ్చి చూశాడు. పదేళ్ల పిల్ల, రెండేళ్లపిల్లడ్ని ఎత్తుకొని నిల్చుంది. అంత చిన్నతనంలోనే భగవంతుడు వారికా విధంగా శాపం యిచ్చాడు. ఆ పిల్ల వాలిపోయిన ముఖంతో, చిలపిరిజుట్టుతో వుంది. పిల్లడి కాళ్లు చేతులు ఈనపుల్లలు మాదిరి వున్నాయి. చీమిడిముక్కు, ఘడియకో, గంటకో అన్నట్లున్నాయా చూపులు. ఆ పిల్ల చూపులు మాత్రం దేనినో వెతుకుతున్నట్లుగా వున్నాయి.

మూర్తి కాస్త అన్నం పెట్టించాడు. ముష్టిది వెళ్ళిపోయింది.

మూర్తి వాళ్ళది పెద్దకుటుంబమే. తామంతా ఒకింట్లో వుంటూ, రెండవయింట్లో సగం భాగం అద్దెకిచ్చారు. ఉదయం పదిగంటలకి మగాళ్ళందరూ ఆఫీస్‌కి వెళ్ళిపోతారు. అదేవేళకి బడిపిల్లలు, కాలేజీలువాళ్ళు, వెళ్ళిపోతారు. ఇక సాయంత్రం వరకూ అక్కడ నిశ్శబ్దమే.

* * *

మధ్యాహ్నం ఒంటిగంటయ్యింటుంది. పక్కింట్లో ఆఫీస్ భాగంలో ఏదోశబ్దం వినిపిస్తూంది. నౌకరురాముడు అప్పుడే భోజనంచేసి వరండామీద కూర్చున్నాడు. మెట్లగదిలో చప్పుడవడంతో రాముడు మెల్లగా లోపలికి వెళ్ళాడు. లోపలికి ఎవరో వస్తున్న అలికిడివిని లోపలి వ్యక్తి తొందరగా బయటపడదామని వెనుదిరిగింది. రాముడికి విషయం అర్థమైంది.

'ఏమే ఎందుకా గదిలా కెళ్లావ్? అసలెంత సేపయింది?' గద్దిస్తూ అడిగాడు.

ఆ పిల్ల వెర్రి చూపులు చూస్తోంది. 'ఏటలా సూస్తున్నావు. అసలేం చేశావా గదిలో' మళ్ళీ గదమాయించాడు.

'ఏటి లేదు బాబూ, ముష్టడుక్కుందామని...' నసుగుతూ సమాధానం చెప్పింది.

'ముష్టికా, దొంగతనానికా'

'నిజం బాబూ, అడుక్కుందికే' అంటూ పోబోయింది.

'వుండు. ఏదీ చూడనీ' అంటూ ఆ పిల్లని సోదా చేశాడు రాముడు. ఏమీ దొరకలేదు.

'ఊఁ. ఎల్లు. ఈసారి మల్లా వచ్చావంటే తంతాను. దొంగముండా' అని కేక వేశాడు.

'ఏంటిది? ఏవిట్రా ఆ కేకలు' అప్పుడే వీధిలోనుండి వచ్చిన చంద్రం అడిగాడు.

'యీ గుంట బాబూ, ఎప్పుడూ ఒత్తుంటాది. ఆరోజు అన్న మేట్లేంగదా, అదే బాబూ. నేను భోజనం సేసొచ్చేసరికి యీ గది కెలుతూంది'.

'ఆహా. ఒరేయ్ రాముడూ. ఇది దొంగ రాస్కెల్. దీన్ని రానీయకండి. ఆ రోజు ఏమో అనుకున్నాను.' అన్నాడు చంద్రం.

'ఎల్లెల్లు. యింకా యేటి సూస్తన్నావ్'

అలాగ రెండుమూడు సార్లు జరిగింది. తీరా దాని ముఖం చూసేసరికి జాలి కలుగుతుంది. మామూలుగానే ఆ రోజు మధ్యాహ్నం ఎండ విపరీతంగా వుంది. తమ యింటిదగ్గిరేదో గొడవ జరగడం చూసి రాముడు చంద్రం త్వరగా గేటును సమీపించారు. చంద్రం అన్న కొడుకు మధు అక్కడ నిల్చొని వున్నాడు.

'ఏరా మధూ, ఏమయింది?' అడిగాడు.

'ఆ .. చెల్లి వీధి గుమ్మంలో మెటల్ గ్లాస్‌తో ఆడుకుంటూంటే ఎవర్తో ముష్టిది తీసుకుని పారిపోయింది. చెల్లికేమో జాంకాయ ఇచ్చింది' అన్నాడు.

చంద్రం లోపలికి వెళ్ళి ముష్టిదాని వివరాలు తెలుసుకున్నాడు. రాముడు, ప్రక్కింటివాళ్ళ నౌకరు ఒక ప్రక్క, చంద్రం సైకిలుమీద మరోప్రక్క వెళ్ళారు.

చిన్న చినుకులు మొదలయ్యాయి. చంద్రం అన్ని సందులు తిరిగి యింటివైపు వచ్చాడు. కాంపౌండ్ గేటు ముందు యింటి వాళ్ళంతా చేరారు. పక్కింటి వాళ్ళ నౌకరు రంగన్న ఎవర్నో దమాయిస్తున్నాడు. చంద్రం గుంపుమధ్యకు చేరుకున్నాడు. అదే ఆ ముష్టిదే. నేల మీద కూర్చుని రాగాలు తీస్తూంది. చంటిపిల్లాడు బిత్తరపోయి చూస్తున్నాడు. అయితే యీ గుంట అనుకున్నంత పనీ చేసిందనమాట.

చంద్రానికి అంతకుముందున్న జాలి, అభిమానం ఎగిరి పోయాయి. అతనికి కోపం, అసహ్యం ముందుకొచ్చాయి,

'చెప్పు. ఆ గ్లాసెక్కడ దాచావో' గట్టిగా ప్రశ్నించాడు. ఆ గుంట నెత్తురో నాకేం తెలియదండి.

'ఇలా సెప్పుడు బాబూ. నాలుగు తగలనిస్తే అదే సెపుతుంది'

'చూడు. నీకేం బెంగలేదు. ఆ గ్లాసెక్కడ దాచావో చెప్పు' అడిగాడు చంద్రం.

'అల్లాల్లకి రూపాయి కమ్మేశాను' అంది భయంగా.

'ఎవరికి ఎక్కడ వాళ్ళిల్లు. చూపించు'

'ఇల్లిక్కడే బాబూ. కాని నాదగ్గర డబ్బుల్లేవు బాబూ కర్చయిపోనాయి'

'ఆ డబ్బులు నేనిస్తాను. ఆ గ్లాసు పట్రా' అని దాని చేతిలో రూపాయుంచాడు.

'మీరిక్కడే వుండండి బాబూ, మిమ్మల్ని చూస్తే అల్లియ్యరు' అంది వెళ్తూ. చంద్రం, రంగన్న దాన్ననుసరించారు. మురళీ సినిమాహాలు సమీపంలో ఎవరికో అమ్మేసిందా గ్లాసు మళ్ళీ వచ్చింది.

'ఊ పద. పోలీస్ స్టేషన్ కి'

'బాబూ చంటిపిల్లోడు సచ్చిపోతాడు.' ఒదిలండి బాబూ' గోలమంది ముష్టిది.

'అదేం కుదర్దు, మా కనవసరంగా రూపాయి దండగ చేయించావ్. పద స్టేషన్ కి' కసిరాడు చంద్రం.

బాబూ. ఇంకెప్పుడూ సెయ్యను. వదలండి బాబూ' మీ కాళ్లకు దణ్ణమెడతాను'

అంది రాగాలు తీస్తూ.

చంద్రానికి ఆ పిల్లడ్ని చూడగానే మనసు కరిగి పోయింది. అందుకే దాన్ని వదిలేశాడు.

---


## కథాంజలి
[స్థాపితము 1938]

విడి ప్రతి ... 25 పై.

సంవత్సర చందా ... రూ 5-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాతమ్స్, స్వదేశమిత్రన్ బుక్ స్టాల్స్‌లోనూ దొరకును.


---

# సుందరుని వచనములు

రచన శ్రీ రాళ్ళపల్లి సుందరం

మేఘమ్ములో నీరు దాగియున్నట్లు
లవణమ్ము జలధిలో కలసి యున్నట్లు
విత్తనమ్మున చెట్టు నిలిచి యున్నట్లు
నీలోన భగవంతుడుండు సుందరుడ ! ౧

ఏడ్చుచు వచ్చితివానాడు భువికి
ఏడ్చుచుండగ రేపు పోదువు దివికి
దుఃఖము నిండిన ఈ ప్రపంచమున
పుట్టక పోయిన నేమి సుందరుడ ? ౨

శిలలోన దేవుని చూచిన నరుడు
నిర్జీవ ప్రతిమను పూజించు నరుడు
సాటిమానవునిలో దేవుని చూచి
గౌరవింపగ లేడు జగతి సుందరుడ ! 3

ఎన్ని నామమ్ము లెన్నెన్ని రూపములు !
ప్రతి ఇంట నొక దేవుడున్నాడు కసును
ఇందర పూజించి లాభ మేమున్న ?
ఒకనిని కొలిచిన చాలు సుందరుడ ! ౪

ఇక్కడ చూచిన ఘోర కృత్యములు
అక్కడ చూచిన పాపపు పనులు
నూటికి ఒక్కడు మంచి వాడున్న
బాగుపడమటయ్యా మనము సుందరుడ ! ౫

రావయ్యా రావయ్యా చూతువుగాని
భగవంతుడిచ్చట నగరూపధారి
కనులకు నిండైన సౌందర్య రూపి
నీ జన్మ ధన్యము రమ్ము సుందరుడ ! ౬